క్లుప్తంగా

అపార్ట్‌మెంట్ నిర్మాణంలో మోసంపై ఫిర్యాదు

గుంటూరు రూరల్: అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నామని చెప్పి, నగదు తీసుకుని చెప్పిన సమయానికి నిర్మించకుండా మోసం చేసిన వ్యక్తులపై బాధితుల ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నరేష్‌కుమార్ వివరాల ప్రకారం అంకిరెడ్డిపాలెం గ్రామంలో నయయుగ గ్రాండ్ పేరుతో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టాడు. ఈ మేరకు రేపల్లెకు చెందిన పేటేరు మురళి అనే వ్యక్తి వద్ద రూ.21 లక్షలు నగదు తీసుకున్నాడు. గోగాన జవహర్, గోగాన సాయి, గాగాన శ్రీదేవి, జీవి రమణ అనే నలుగురు తనను మోసం చేశారని మురళి ఫిర్యాదులో పేర్కొన్నాడు. చెప్పిన సమయం దాటిపోయినా అపార్ట్‌మెంట్ నిర్మించకపోగా.. కాలయాపన చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నామని నల్లపాడు పోలీసులు తెలిపారు.

'మన్‌కీ బాత్'ను మరింత మంది వీక్షించేలా చర్యలు

గుంటూరు మెడికల్: ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని జిల్లాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలంతా ఒకేచోట కాకుండా పలు ప్రాంతాల్లో ప్రజలతో కలసి వీక్షించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ తెలిపారు. మున్ముందు మరింత మంది చూసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర పదాధికారులు, మోర్చా రాష్ట్ర పదాధికారులు, జిల్లా పదాధికారులు, మోర్చా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, శక్తి కేంద్ర ప్రముఖులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారని తెలిపారు. మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత తొలిసారిగా పాల్గొన్న మన్ కీ బాత్‌లో ఆయన 20–20 క్రికెట్ ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టును అభినందించారన్నారు. అరకు కాఫీ గురించి ప్రస్తావించారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అంతా తల్లి పేరు మీద ఒక మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి పిలుపునిచ్చారని తెలిపారు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మన్ కి బాత్ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక కొత్తపేట శివాలయం సమీపంలోని అహల్య హాస్పిటల్‌లో మాజీ మంత్రి, బీజేపీ నేత డాక్టర్ శనక్కాయల అరుణ, తూర్పు సమన్వయకర్త డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, హాస్పిటల్ సిబ్బంది, పేషంట్స్‌తో కలిసి చూశారు.

కార్మెల్ మాతను దర్శించుకున్న భక్తులు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై ఉన్న కార్మెల్ మాతను దర్శించుకునేందుకు ఆదివారం పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. ఉదయం నుంచి జోరుగా వర్షం పడుతున్నా కడప, ధర్మవరం, నంద్యాల, ఆదోని ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు బాల ఏసు దేవాలయంలో నిర్వహించిన దివ్య పూజా బలి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కొండను చేరుకుని.. తల నీలాలు సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు తమ వెంట తెచ్చుకున్న విత్తనాలను కార్మెల మాత వద్ద ఉంచి, పూజలు చేశారు. వర్షాలు పడే సమయంలో పొలాల్లో విత్తుకు ముందు ఇక్కడ ప్రార్థనలు చేసి, విత్తుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ఏపీపీ చారుమతికి సత్కారం



నగరంపాలెం: గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) కె.చారుమతి ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. డీపీఓలోని హాలులో ఆమెను పీపీలు ఘనంగా సత్కరించారు. ఏపీపీగా ఆమె సేవల్ని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పాతూరి మధుసూదనరావు, రోజ్‌దార్, ప్రసాద్‌నాయక్, సుకుమార్, సునీల్ కుమార్, స్వర్ణలతభాను, లక్ష్మీరాం నాయక్, శౌరీ, మురళీకష్ణ, శివలీల, లక్ష్మీరాణి, శ్యామల, శ్రీకాంత్, ఏపీ టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వజ్రాల రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్: ప్రజల నుంచి తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో అర్జీలు స్వీకరిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

నాణ్యమైన విత్తన ఎంపిక.. దిగుబడికి ఉపయుక్తం

- విత్తన కొనుగోలులో జాగ్రత్తలు తప్పనిసరి
- దుకాణదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి



పురుగు మందుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

పొన్నూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభంకానున్న నేపథ్యంలో.. వ్యాపారులు ఇప్పటికే విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచారు. కొన్ని చోట్ల రైతులు వాటిని కొనుగోలు చేసుకుంటున్నారు. అయితే విత్తనాల ఎంపికలో అప్రమత్తమై తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా.. పెట్టుబడి, పంట కాలం వృథా అయ్యే ప్రమాదం ఉంది. అన్నదాతల అమాయకత్వం, నిరక్షరాస్యతను ఆసరా చేసుకుని పల్లెల్లో నాసిరకం, నకిలీ విత్తనాలు అంటగట్టే అవకాశం ఉంది. ఇప్పటికే వ్యవసాయశాఖ, విజిలెన్స్ శాఖ తమ బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతోంది. తనిఖీలు కొనసాగుతున్నా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఏటా మండలంలో ప్రభుత్వ ఆమోదం పొందని విత్తన విక్రయాలు కొనసాగుతున్నాయి. దొరికిన సందర్భాల్లోనే అధికారులు కేసులు నమోదు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

30వేల ఎకరాల్లో సాగు..

ఈ ఖరీఫ్ సీజన్‌లో పొన్నూరు మండలంలో సుమారు 30 వేల ఎకరాల్లో రైతులు వరిపంట ఎక్కువగా సాగు చేస్తారు. వరిసాగుకు సుమారు 1800 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉంటుందని వ్యవసాయాధికారుల అంచనా. ప్రభుత్వం సబ్సిడీపై సుమారు 350 క్వింటాళ్లను రైతు భరోసా కేంద్రాల ద్వారా ఏపీ సీడ్స్ పేరుతో విత్తనాలను విక్రయిస్తోంది. మిగతా విత్తనాలను మార్కెట్లో కొనుగోలు చేస్తారు. 25 కిలోల బ్యాగు రూ. 41.80లు ఉండగా సబ్సిడీపై రూ. 36.80లకు అందిస్తోంది. మండల పరిధిలో 20, పట్టణంలో 2 రైతు భరోసా కేంద్రాలున్నాయి. ప్రస్తుతం అన్ని కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. అయితే ప్రభుత్వం అందించే విత్తనాల కంటే మార్కెట్లో లభించే విత్తనాలు అధిక ధరలు ఉన్నప్పటికీ రైతులు వారికున్న పరిచయాలు, రుణ సౌకర్యం వివిధ కారణాలతో మార్కెట్లోని దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేస్తుంటారు. మార్కెట్లో కొనుగోలు సమయంలో రైతులు పలు సూచనలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వ్యవసాయ శాఖ జారీ చేసిన లైసెన్సు కలిగిన దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయాలి.
- తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి.
- విక్రయ లైసెన్స్‌ను దుకాణాల్లో ప్రదర్శించాలి. నిల్వలను స్టాకు రిజిస్టరులో నమోదు చేసిన తర్వాత విక్రయాలు ప్రారంభించాలి.
- విక్రయ కేంద్రంలో అమ్మకానికి ఉంచిన ఎరువులను 0 ఫాం జత చేసి కొనాలి.
- బస్తాపై ఉన్న ధరకు మించి కొనుగోలు చేయరాదు.
- కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా డీలరు నుంచి లాట్ నంబరు, వెరైటీ పేరుతో రసీదులు తీసుకోవాలి. పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలి.
- విత్తన ప్యాకెట్లు, బస్తాలపై లాట్ నంబరు, కంపెనీ పేరు, ప్యాకింగ్ తేదీ, లేబుల్ తదితరాలను పరిశీలించాలి.
- విత్తన మొలక శాతం సరిగ్గా ఉందో లేదో చూసుకోవాలి. విడిగా విక్రయించే విత్తనాలు కొనొద్దు

రసీదులు తప్పనిసరి



రైతు భరోసా కేంద్రాల సబ్సిడీ విత్తనాలను రైతులకు అందిస్తున్నాం. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రైతులు చాలా అప్రమత్తంగా ఉండాలి. కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలి. పంటకాల పూర్తయ్యే వరకు భద్ర పర్చుకోవాలి. ఒకవేళ విత్తనాలు ఆశించిన మేర మొలకెత్తక పోయినా, దిగుబడి రాకపోయినా కంపెనీ నుంచి నష్టపరిహారం పొందవచ్చు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలి.

– వెంకట్రామయ్య, వ్యవసాయాధికారి, పొన్నూరు

సమస్యల వలయంలో అంకిరెడ్డిపాలెం



దాసుల కాలనీలో రోడ్డుపై మురుగు నీరు

గుంటూరు రూరల్: చిన్నపాటి వర్షానికే గ్రామంలోని డ్రెయినేజీలు రోడ్డుపై పొర్లుతూ కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండా పోతోందని అంకిరెడ్డిపాలెం, దాసులపాలెం కాలనీల వాసులు వాపోతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసిందని, డ్రెయినేజీలు లేక మురుగు రోడ్లపైకి వచ్చి, నిలిచిన నీటిలో దోమల బెడదతో అనారోగ్యాలపాలవుతున్నామని వాపోతున్నారు. దోమల బెడదతో గ్రామంలో విష జ్వరాల బారిన పడుతున్నామని, దీనికితోడు గ్రామంలో రాత్రిళ్లు వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నామని చెప్తున్నారు. వీధి దీపాలు వెలుగడం లేదని అధికారులకు మొత్తుకున్నా పట్టించుకున్న నాథుడు లేడని అంటున్నారు. తాగు నీటికి సైతం అల్లాడి పోతున్నామని మున్సిపల్ సిబ్బంది తాగునీటిని అందించటంలో విఫలమవుతున్నారని అంటున్నారు. తాగునీరు వారంలో ఒకటి రెండు రోజులు మాత్రమే వస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న గ్రామాన్ని కాపాడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల సేవలు కొనసాగించాలి

తాడేపల్లిరూరల్: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,618 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పని చేస్తున్నారని కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ చైర్మన్ కుమ్మరి సురేష్ తెలిపారు. ఈ మేరకు చైర్మన్ సురేష్, కో–చైర్మన్ కల్లూరి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 12 నెలల కాలానికి ప్రతి ఏటా సేవల కొనసాగింపు ఉత్తర్వులు జారీ అవుతాయని, గత ఏడాది జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఏప్రిల్ నెలాఖరుతో సేవలు ముగిశాయని తెలిపారు. ఈ ఏడాది మే నుంచి 2025 ఏప్రిల్ నెలాఖరు వరకు సేవలను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉందన్నారు. కానీ సార్వత్రిక ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపడంలో జాప్యం జరిగిందని, కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ సమస్యపై ముఖ్యమంత్రి, మానవ వనరుల మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. మేలో సప్లిమెంటరీ పరీక్షల సన్నద్ధతకుగాను విద్యార్థులకు ప్రత్యేక క్లాసులను నిర్వహించడంతో పాటు, పరీక్షల విధులు, ఈ ఏడాది ప్రవేశాలకు కృషి చేయడం, జూన్‌లో డిజిటల్ స్క్రీన్ వ్యాల్యూయేషన్ వంటి కీలక బాధ్యతలను కాంట్రాక్ట్ లెక్చరర్లు నిర్వర్తించారని గుర్తుచేశారు. రెండు నెలలుగా వేతనాలు లేకపోవడంతో కుటుంబ పోషణకు సతమతమవుతున్నామన్నారు. ప్రభుత్వ పెద్దలు, అధికారులు చొరవ తీసుకుని ఈ ఏడాది మే నెల 1నుంచి 12 నెలల కాలానికి కొనసాగింపు ఉత్తర్వులివ్వాలని ఆయన కోరారు.

పస లేని రాష్ట్రపతి ప్రసంగం

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ఇంజినీర్ సదాశివం

లక్ష్మీపురం: ఎన్నికల అనంతరం ఏర్పడిన కొత్త ప్రభుత్వ విధానాల్ని వెల్లడించాల్సిన రాష్ట్రపతి ప్రసంగం పస లేకుండా మూస ధోరణిలో సాగడం విచారకరమని విశ్రాంత ఇంజినీర్ ఎస్.సదాశివం అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రపతి ప్రసంగంలో నీట్ దోషుల్ని శిక్షిస్తామనడం తప్పా కొత్త విషయాలేమి చెప్పలేదని విమర్శించారు. ఇటీవల ఎన్నికల్లో ప్రజలు ప్రధానమైనవిగా భావించిన అధిక ధరలు, పెరిగిన నిరుద్యోగం వంటి సమస్యలకు పరిష్కారాల్ని చూపించక పోవవడం, కనీసం ఉపశమనం కల్పించడం గురించి అయినా పేర్కొనక పోవడం సబబుకాదని పేర్కొన్నారు. ప్రభుత్వ సుపరిపాలన గురించి గొప్పగా చెప్పారన్నారు. అగ్నిపథ్ ఊసే ఎత్తలేదని విమర్శించారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ వివక్షా పూరితమైన పౌరసత్వ సవరణ చట్టాన్ని గొప్పగా ప్రస్తుతించారన్నారు. సభలో ఎలాంటి చర్చ లేకుండా ఆమోదంప జేసుకున్న కొత్త క్రిమినల్ చట్టాలు జులై 1 నుంచి అమలులోకి రానున్నాయని చెప్పడం నిరంకుశ పోకడలకు అద్దం పడుతోందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

- పెదవడ్లపూడి హైలెవల్ చానల్ పూర్తి చేయాలి
- పంట కాలువల్లో తూటి కాడను తొలగించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రామారావు

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదల ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పేర్కొన్నారు. తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో రామారావు మాట్లాడారు. నియోజకవర్గంలో సుమారు 22 వేల కుటుంబాలు వివిధ రకాల ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్నారని, ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు మంజూరు చేస్తామని లోకేష్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. వారి పాదయాత్ర సందర్భంగా సీతానగరంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని శిలాఫలకాన్ని సైతం ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని రామారావు కోరారు. రాజధాని ప్రాంతం కావడం వల్ల ఈ ప్రాంతంలో నూతన నిర్మాణాలు, అపార్ట్‌మెంట్స్ పెద్ద ఎత్తున పెరిగిపోయాయని, దీనికి తగిన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షం వస్తే నీరు అంతా రోడ్డు పై నిలబడుతోందని తెలిపారు. తాడేపల్లి రూరల్ మండలం కుంచనపల్లి ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని చెప్పారు. కృష్ణా పుష్కరాల సందర్భంగా రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్లు తొలగించిన వారికి ఇంతవరకు ప్రత్యమ్నాయం చూపలేదని, వెంటనే వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెద్దవడ్లపూడి హైలెవల్ చానల్‌ను పూర్తి చేయాలని, గుంటూరు చానల్, కొండవీటివాగు, తదితర పంట కాలువల్లో తూటికాడను తొలగించాలని కోరారు.

నకిలీ డాక్యుమెంట్లతో స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

గుంటూరు రూరల్: అద్దెకు ఇచ్చిన స్థలానికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి మోసం చేసిన ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయపురి కాలనీ 7వ లైన్‌కు చెందిన శెట్టి జ్యోతిలక్ష్మి తన భర్త పూర్వికులకు చెందిన వాస వీనగర్‌లోని 500 గజాల స్థలం మేకతోటి వెంకటప్పయ్య అనే వ్యక్తికి రూ.12 వేలకు అద్దెకు ఇచ్చింది. ఈ క్రమంలో వెంకటప్పయ్య జ్యోతిలక్ష్మికి తెలియకుండా స్థలానికి నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి, విద్యుత్ మీటరు, స్థలంలో షెడ్లు నిర్మించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. నకిలీ డాక్యుమెంట్‌లో తన భర్తకు మొదటి భార్య విజయలక్ష్మి అని ఆమె పేరుతో విద్యుత్ మీటరును పొందారని ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఏఐఎస్ఎఫ్ కార్యవర్గ సభ్యుడిగా నాసర్‌జీ ఎన్నిక

లక్ష్మీపురం: తిరుపతిలోని బైరాగె పట్టెడలో గల సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాల్ని ఈనెల 29,30 తేదీల్లో జాతీయ అధ్యక్షుడు విక్కీ మహేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో నగరానికి చెందిన ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి బందెల నాసర్‌జీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. నాసర్‌జీ ఎన్నికపై నగరానికి చెందిన విద్యార్థి యువజన సంఘాల నయకులు హర్షం వ్యక్తం చేశారు.

మాదిగ మహిళా సమాఖ్యను బలోపేతం చేయాలి

తెనాలిరూరల్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అనుబంధ విభాగమైన మాదిగ మహిళా సమాఖ్యను మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందని సమాఖ్య మండల నాయకురాలు ఆలపాటి కరుణ అన్నారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాల సమావేశాన్ని ఆదివారం స్థానిక ఐతానగర్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ కల్యాణమండపంలో నిర్వహించారు. మహిళా సమాఖ్య నూతన కమిటీ ఏర్పాటుకు సన్నాహక సమావేశంలో కరుణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మాదిగ సామాజికవర్గానికి అన్ని విధాలా న్యాయం జరిగేలా మహిళా సమాఖ్య సభ్యులు పోరాడాల్సి ఉందన్నారు. ఇందుకోసం పటిష్ట కార్యవర్గాన్ని ఎన్నుకోవాల్సిన అవసరముందని చెప్పారు. త్వరలో కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వేమూరి సుధీర్, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకుడు నలుకుర్తి సద్గుణరావు, మాజీ పట్టణ అధ్యక్షుడు కొండముది బోసుబాబు, సాపాటి రవి, సీనియర్ న్యాయవాది సుద్దపల్లి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

చేతిరాత నైపుణ్యంతో అన్ని రంగాల్లో రాణింపు



ఉపాధ్యాయులతో రవీంద్రనాథ్‌రెడ్డి, రామమోహనరావు

గుంటూరు ఎడ్యుకేషన్: చేతిరాత నైపుణ్యంతో జీవితంలో అన్ని రంగాల్లో రాణించగలరని ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్తంభాలగరువులోని చేబ్రోలు మహాలక్ష్మి–పుల్లయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ఆదివారం క్యాలీగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులంతా చేతిరాతను అందంగా మలచుకోవాలని సూచించారు. దీని ద్వారా ఏకాగ్రత, మానసికపరమైన మార్పులు సంభవిస్తాయని తెలిపారు. క్యాలీగ్రఫీ ఫ్యామిలీగా ఏర్పడిన ప్రభుత్వ ఉపాధ్యాయులు సొంత ఖర్చుతో తోటి ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ కల్పించడాన్ని ప్రశంసించారు. విద్యార్థుల చేతిరాతను అందంగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో చేతిరాత శిక్షణ నిర్వాహకుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహనరావు, ఈ.అనిల్‌కుమార్, ప్రసాద్, షాజీర్, నాగలక్ష్మి, సత్యనారాయణ రిసోర్సు పర్సన్లుగా వ్యవహరించారు.

ఐసీఏఐ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ పరుగు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) 75 ఏళ్ల వేడుకలకు సిద్ధమవుతున్న సందర్భంగా ఐసీఏఐ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సీఏ రన్ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంపాలెంలోని రమేష్ హాస్పిటల్స్ నుంచి శ్రీనివాసరావుతోటలోని ఐసీఏఐ భవన్ వరకు నిర్వహించిన పరుగులో సీఏలు పాల్గొన్నారు. ఐసీఏఐ గుంటూరు శాఖ చైర్మన్ నూతలపాటి అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి పరుగును ప్రారంభించారు. కార్యక్రమంలో గుంటూరు చాప్టర్ ఉపాధ్యక్షుడు చింతా రఘునందన్, కార్యదర్శి రుద్రవరపు భరద్వాజ్, సికాస చైర్మన్ కన్నెగంటి మృత్యుంజయరావు, పాస్ట్ చైర్మన్ మద్ది రవితేజ, సీఏలు, సీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

తెనాలి: పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌సీడీఎస్ వ్యాధుల స్క్రీనింగ్ ఉచిత వైద్య శిబిరాన్ని బుర్రిపాలెం రోడ్డులోని డాక్టర్ శారద భవనంలో నిర్వహించారు. పట్టణ, పరిసర గ్రామాల్నుంచి తరలి వచ్చిన 200 మందికి పరగడుపున షుగర్, బీపీ పరీక్షలు చేశారు. తర్వాత అల్పాహారం అందించి ఇతర వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్, కాల్షియం, విటమిన్ మందులను నెలకు సరిపడా అందజేశారు. వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామం చేసినట్టయితే జీవితం ఆరోగ్యవంతంగా సాగుతుందని సూచించారు. ప్రజల్లో అవగాహన కోసం ప్రతి నెల ఆదివారం వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని డాక్టర్ శారద వెల్లడించారు.

శిల–శిల్పం, వైద్య నిఘంటువు పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాల ఆవిష్కరణలో అతిథులు, సంస్థ నిర్వాహకులు

నగరంపాలెం: గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ 15వ వార్షికోత్సవంలో భాగంగా బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం నిఘంటు నిర్మాత పెద్ది సాంబశివరావు రచించిన శిల–శిల్పం, వైద్య నిఘంటువు పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, కాకతీయ కన్వెన్షన్ సెంటర్ అధ్యక్షులు డాక్టర్ యర్రా నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సంజీవి హాస్పిటల్స్ డాక్టర్ అర్థలపూడి సృజన్‌కుమార్ హాజరై పుస్తకాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పూర్వ ఆచార్యులు శ్రీహరి మురుగుడు, లీగల్ అడ్వైజర్ అండ్ ఫ్యామిలీ కౌన్సిలర్ మొవ్వ మృత్యుంజయరావు మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా 1,500 సేవా కార్యక్రమాలు, 50 గ్రంథాలు ప్రచురణ చేసిన ఘనత సంస్థదని ప్రశంసించారు. అనంతరం అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ చిట్టినేని శివ కోటేశ్వరరావు, గుళ్లపల్లి రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం- అన్నదాతల హర్షం

వర్షాలతో విత్తు వేసిన రైతులకు ఊరట



అదునుకు వర్షం కురవడంతో మినుము పంట సాగు



విత్తుకు సిద్ధం చేసుకున్న దుక్కులు

తాడికొండ: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో పదును పెరగడంతో.. అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మినుము, పత్తి, జ్యూట్ ఇతర పంటలు వేసి వరుణ దేవుడి రాక కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. మొన్నటి వరకు పొడిగా ఉన్న వాతావరణంతో ఎండ వేడిమి, ఉక్కపోతకు భూమి వేడెక్కి పైరు ఎదుగుదలకు కొంత ఇబ్బందికర పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం ఆ వాతావరణం పోయి పూర్తిగా చల్లబడి వర్షాలు కురుస్తుండటంతో పంటలు ఏపుగా పెరిగేందుకు అవకాశం ఉందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వరకు వరుసగా మే నెలలో అందే రైతు భరోసా సాయం ఈ ఏడాది ఇంకా రైతుల ఖాతాల్లో జమకాని నేపథ్యంలో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి సాయం లేకుండా పంటలను కాపాడుకోవడం ఎలా అని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

నేడు నృసింహస్వామి హుండీ లెక్కింపు

మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు సోమవారం చేపట్టనున్నట్లు ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఎగువ దిగువ సన్నిధులతో పాటు ఘాట్ రోడ్డుపై వేంచేసి ఉన్న ఉపాలయం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించి లెక్కింపు సోమవారం ఉదయం 9 గంటలకు ఆలయ ముఖ మండపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గత భక్తులు లెక్కింపులో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి రామస్వామి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న విల్సన్

లక్ష్మీపురం: తెనాలి తాలూకా కొల్లిపర మండలం దావులూరు గ్రామానికి చెందిన కాబోతు రామస్వామి భారత కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి జీవితమంతా కృషి చేశారని మాజీ ఎమ్మెల్సీ, వ్యవసాయ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు జల్లి విల్సన్ కొనియాడారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం కాబోతు రామస్వామి 68వ వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ జల్లి విల్సన్‌తో పాటు, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ రైతులు, కూలీల అభ్యున్నతికి రామస్వామి అలు పెరుగని పోరాటాలు సాగించారని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తన్నీరు ప్రభుదాస్, రామస్వామి మనుమరాలు కోటేశ్వరి, మెడికల్ ఎంప్లాయిస్ రాష్ట్ర నాయకులు బి.కృష్ణమోహన్ తదితరులు ప్రసంగించారు.